# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్



## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**విమానం దుబాయ్** ఎయిర్‌పోర్ట్‌లో దిగుతుందన్న పైలట్ ప్రకటనతో మెలుకువ వచ్చింది. స్థానిక దుబాయ్ టైం ఉదయం 6-20కి మా విమానం లేండైంది. దుబాయ్‌లో మా కనెక్టింగ్ ఫ్లైట్‌కి గంటన్నర మాత్రమే సమయం ఉంది.

మళ్ళీ సెక్యూరిటీ చెక్ ముగించుకుని సియాటిల్ వెళ్ళే ఆ తెలుగువారిని వారి గేట్ దగ్గర దింపి మా గేట్‌కి చేరుకున్నాం. అగస్ట్ 5న మేం అమెరికానించి తిరిగి వచ్చేప్పుడు దుబాయ్‌లోనే విమానం మారాం. మళ్ళీ ఇంత తొందరగా ఆ ఎయిర్ పోర్ట్‌కి వస్తామనుకోలేదు. దుబాయ్ టైం 7.50కి మా విమానం ఇకె 141 మేడ్రిడ్‌కి బయలుదేరింది. మా సీట్ నంబర్లు 29 ఇ. 29 ఎఫ్. జోన్ ఈ. విమానం సీటింగ్ 3+4+3. దుబాయ్ నించి మేడ్రిడ్‌కి 5,918 కిలోమీటర్ల దూరమని విమానంలోని మానిటర్లో కనిపించింది. టివిలో స్పేనిష్ సినిమాలు ఎక్కువ. విమానం బయలుదేరాక ఇచ్చిన బ్రేక్‌ఫాస్ట్ మెన్యూ కార్డ్‌లో ఒక్క వెజ్ ఐటెంలేదు. వెజ్ కోరితే అది లేదని చెప్పి, రెండు ఛీజ్ ముక్కలు, వెజ్‌సలాడ్, బన్, జామ్, బటర్ ఇచ్చారు. నా ట్రేలో క్రాయ్‌జాంట్, ఫ్రూట్ సలాడ్ (పైనాపిల్, రెండు నల్ల ద్రాక్షలు, చిన్న పుచ్చకాయ ముక్క, ఓ ఖర్జూరం) ఉన్నాయి. నేను టీ, పద్మజ కాఫీ తాగాం. విమానంలో కొందరు ఇండియన్స్ కనిపించారు. ఓ యువకుడు నా దగ్గరకి వచ్చి 'మీరు ఎస్ఓటిసి గ్రూప్ టూర్లో వస్తున్నారా?' అని అడిగాడు. అవునంటే తన పేరు దీపక్ అని చెప్పాడు. తనెవరో చెప్పలేదు.

దుబాయ్, బెహరిన్, బాగ్దా, నైలునది, సూయెజ్ కెనాల్, అలెగ్జాండ్రియా, టునిస్‌ల మీదుగా మా విమానం మేడ్రిడ్‌కి ప్రయాణించింది. స్థానిక సమయం మధ్యాహ్నం 1.25కి మేడ్రిడ్ విమానాశ్రయంలో రన్‌వే మీద దిగి గేట్ దగ్గరకి వెళ్ళి ఆగింది. విమానం తలుపు తెరిచేలోగా కిందనించి చప్పుళ్ళు వినిపించాయి. కార్గో హోల్డ్‌లోంచి సామాన్లు దింపేప్పుడు వినిపించే చప్పుళ్ళవి. ఏరో బ్రిడ్జ్ మీద నించి దిగాక 4ఎస్ టెర్మినల్లో ఇమిగ్రేషన్ క్యూలో నిలబడ్డాం. మా పాస్‌పోర్ట్‌లని చూసి, ప్రశ్నలేం అడక్కుండా స్టాంప్స్ వేసారు. ఎయిర్‌పోర్ట్ చాలా పెద్దది. ఉచిత వైఫై సౌకర్యం ఉండటంతో పద్మజ మా అమ్మాయిలకి మేం మేడ్రిడ్‌కి క్షేమంగా చేరినట్లు వాట్సప్‌లో మెసేజ్ పంపింది.



మేము ప్రయాణానికి ముందే మా ఐటినరరీని, మేం బస చేసే హోటల్స్, ఫోన్ నంబర్లని మా ముగ్గురు పిల్లలకి ఈ మెయిల్ చేసాం. పెద్దగా అవసరం ఉండదని నేను ఏ టూర్లోను ఇంటర్నేషనల్ రోమింగ్ తీసుకోను.

దారిలోని సూచనలని అనుసరించి లగేజ్ కోసం ఎస్కలేటర్లో కిందకి దిగి వెళ్ళి అక్కడ మోనో రైలెక్కాం. మూడు నిమిషాల్లో అది బిల్డింగ్ 4లో ఆగింది. అక్కడ దిగి కొద్దిగా ముందుకి వెళ్ళగానే ఓ ఉద్యోగి మా బోర్డింగ్ పాస్ చూసి, మా సామానున్న కేరసోల్ వైపు చూపించాడు. మా సామాను తీసుకున్నాక దీపక్ ఇండియన్ బృందంతో వచ్చి మమ్మల్ని వేచి ఉండమని చెప్పాడు. అప్పుడు అతను ఎస్.ఓ.టి.సి నించి వచ్చిన మా టీం మేనేజరని అర్థమైంది. అతను లగేజ్ తీసుకుని మిగిలిన బృందంతో వచ్చాక తన దగ్గరున్న పర్యాటకుల జాబితాలోని పేర్లని పిలుస్తూ టిక్ చేసుకున్నాడు. బెంగళూర్ నించి రావల్సిన జయదేవ్ అనే కన్నడ అతను రాలేదు. దీపక్ ఎయిర్‌పోర్ట్‌లోకి వెళ్ళి అతని కోసం వెదికి, రాలేదని కన్ ఫం చేసుకున్నాక బయటకి వచ్చాడు. అంతా ఎయిర్‌పోర్ట్ బయటున్న సెవెన్ సీటర్ దగ్గరకి నడిచాం. బస్ డ్రైవర్ని దీపక్ మాకు పరిచయం చేసాడు.

"ఇతను మిస్టర్ గమాల్. మన పైలట్."

చాలా దేశాల్లో టూరిస్ట్ వాహనాల డ్రైవర్ని పైలట్ అంటారు. అతను డిక్కీలో సామాను పెడుతూంటే నేను సహాయం చేయబోయాను. దీపక్ నన్ను వారిస్తూ చెప్పాడు.

"వాళ్ళకిష్టం ఉండదు. వాళ్ళే ఆర్గనైజ్డ్‌గా పెడతారు."

బస్ ఎక్కాక పద్మజ చెప్పింది.

"మీరు గ్రీన్ ఛానల్లో నాకన్నా కొద్దిగా ముందు నడిచి వెళ్ళారు. ఓ కస్టమ్స్ ఆఫీసర్ నన్ను 'ఒంటరిగా ఎందుకు వచ్చారు?' అని అడిగి నా సూట్‌కేస్‌ని తెరవమన్నాడు. కానీ దీపక్ అతనితో నేను ఎస్.ఓ.టి.సి పర్యాటక బృందంతో వచ్చానని, ఒంటరిగా రాలేదని చెప్పడంతో నన్ను పంపించేసాడు."

మా వేన్ బయలుదేరింది. ప్రపంచంలోని అనేక కొత్తప్రాంతాలని అన్వేషించి, వాటిని తమ సామ్రాజ్యంలో కలుపుకుని, తమ భాషా సంస్కృతులని విశ్వవ్యాప్తం చేసిన స్పెయిన్‌లో మా పర్యటన ఆరంభమైంది.

## స్పెయిన్

దీని అధికార పేరు రైనో దే ఎస్పానో. అంటే కింగ్ డమ్ ఆఫ్ స్పెయిన్. యూరప్ ఖండంలో నైరుతీ దిశలో ఉన్న స్పెయిన్‌కి అట్లాంటిక్ సముద్రంలో, స్ట్రైట్ ఆఫ్ జిబ్రాల్టర్‌లో కొన్ని టెరిటొరీలున్నాయి.. 5,05,990 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం. దక్షిణ, తూర్పు భాగాల్లో మెడిటరేనియన్ సముద్రం, ఉత్తర, ఈశాన్య దిశలో ఫ్రాన్స్, అండోరా, బే ఆఫ్ బిస్కే, పశ్చిమ వాయువ్యాలలో పోర్చుగల్, అట్లాంటిక్ సముద్రం దీని సరిహద్దులు. అధికార భాష స్పానిష్. జనాభాలో 62% మంది క్రిష్టియన్స్. వారిలో 61%మంది రోమన్ కేథలిక్స్, 1% ఇతర తెగల క్రిష్టియన్స్. 34% కి మతంలేదు. 4% ఇతర మతాలు. బ్రిటన్‌లాగా రాజ్యాంగబద్ధ రాజరికం ఉంది. ప్రస్తుత రాజు కింగ్ ఫెలిపె -6. మార్చ్ 1812లో స్పెయిన్ మొదటి రాజ్యాంగాన్ని రచించారు. జనాభా 4,74,50,000. కరెన్సీ యూరో. యూరోపియన్ యూనియన్‌లో ఇది రెండో పెద్దదేశం. యూరప్ ఖండంలో ఏరియాలో ఇది నాలుగో పెద్ద దేశం. రాజధాని మేడ్రిడ్ ఇతర ముఖ్య నగరాలు బార్సిలోనా, వేలన్షియా, సెవిల్, మలాగా.

2000 బిసిలో రోమన్స్ దీన్ని గెలుచుకుని హిస్పానియా అనే పేరు పెట్టారు. 8-15 శతాబ్దాల్లో 700 ఏళ్ళు ఇది ముస్లిం పాలనలో ఉంది. రోమన్స్, అరబ్బులు, యూదులు, రోమా (జిప్సీ)ల సంస్కృతుల ప్రభావం వీరి ఆహారం మీద పడింది. 1492లో క్రిష్టియన్స్ దీన్ని ఆక్రమించారు. ఆ సంవత్సరమే క్రిష్టఫర్ కొలంబస్ ఇండియాని కనిపెట్టడానికి ఓడలో బయలుదేరాడు. 1492లో క్రిష్టియన్స్ దీన్ని ఆక్రమించారు. ఆ సంవత్సరమే క్రిష్టఫర్ కొలంబస్ ఇండియాని కనిపెట్టడానికి ఓడలో బయలుదేరాడు. 1492 నించి 1800 దాకా స్పానిష్

నావికులు ప్రపంచమంతా పర్యటించి అనేక భూభాగాలని స్పెయిన్ కిరీటం కిందకి తెచ్చారు. 16 వ శతాబ్దం నించి 19వ శతాబ్దం దాకా అనేక చోట్ల స్పెయిన్ కాలనీలని ఏర్పాటు చేసుకోవడంతో అప్పట్లో అతి పెద్ద సామ్రాజ్యమైంది. దాంతో చాలా తరాలు అది ప్రపంచంలోని అత్యంత ధనికదేశంగా ఉండేది. స్పానిష్ భాష ఆ కాలనీల్లో రెండో ప్రధాన భాషైంది. ఫలితంగా నేడు 57 కోట్లమంది స్పానిష్ భాషని మాట్లాడుతున్నారు. ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో దీనిది రెండో స్థానం. మొదటిది మాండరిన్. యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్స్‌లో 47 సైట్స్ స్పెయిన్‌లోనే ఉన్నాయి.

యునైటెడ్ నేషన్స్, ఇయు కౌన్సిల్ ఆఫ్ యూరప్, నేటో, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, జి -20 మొదలైన వాటిలో స్పెయిన్‌కి సభ్యత్వం ఉంది. బరోక్ (1800ల్లో) సమయంలో స్పానిష్ సంస్కృతి ఎక్కువగా అభివృద్ధి చెందింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అనేకమంది చిత్రకారులు, కవులు, శిల్పులు, నృత్యకారులు, క్రీడాకారులు ఇక్కడ ఉన్నారు. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలలో స్పెయిన్ తటస్థ దేశంగా ఉంది. దీని జాతీయ గీతానికి ట్యూన్ తప్ప పదాలు లేవు. బునోల్ అనే ఊళ్ళో ఏటా 'లా టొమాటినో' ఉత్సవాన్ని జరుపుతారు. టొమేటోలని ఒకరి మీద మరొకరు విసురుకునే ఆటది. దీనికి ప్రపంచం అన్నిచోట్లనించి పర్యాటకులు వస్తారు.

ఎయిర్‌పోర్ట్‌కి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేరియెట్ కొస్లాడా హోటల్‌కి పది నిమిషాల్లో చేరుకున్నాం. అప్పుడు టైం మధ్యాహ్నం మూడైంది. రెండు రోజులు మా బస అందులోనే.

దీపక్ మా పాస్‌పోర్ట్‌లని తీసుకుని రిసెప్షన్ దగ్గరకి వెళ్ళాడు. ఆమె స్కేన్ చేసుకుని పాస్‌పోర్టులు తిరిగి ఇచ్చేసింది. మేం వేచి ఉంటే, దీపక్ రిసెప్షనిస్ట్ నించి మా గదుల ఎలక్ట్రానిక్ తాళం చెవులు తీసుకుని పేర్లు పిలిచి ఎవరిది వారికి ఇవ్వబోయే ముందు చెప్పాడు.

"రిలాక్సై సాయంత్రం ఆరుం ముప్పావుకి రిసెప్షన్‌లో నన్ను కలవండి. మిమ్మల్ని డిన్నర్‌కి ఇండియన్ రెస్టరెంట్‌కి తీసుకెళ్తాను."

"బాత్ రూంలో నీళ్ళు తాగచ్చు. ఈ దేశంలో శుభ్రమైన నీరే" ఒకరు అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పాడు.

మాలో ఎవరు వెజిటేరియనో, ఎవరు నాన్ వెజిటేరియనో అడిగి రాసుకున్నాడు. పద్మజ వైఫై గురించి రిసెప్షన్‌లో అడిగింది. లాబీలో వాడితే ఉచితం. గదిలో వాడితే గంటకి 6 యూరోలు అని చెప్పాడు. ఇంతలో లాబీలోకి ఓ ఇండియన్ జంట వచ్చింది. వాళ్ళు అమెరికానించి ఆ రోజే వచ్చారు. ఈ ట్రిప్‌లో అమెరికాలోని వివిధ నగరాల నించి వచ్చిన 22 మంది ఎన్నారైల బృందం కూడా మాతో కలిసింది.

మా రూం నంబర్ 220. మా సామాను గదిలో పెట్టి, కిందకి వచ్చి హోటల్ బయట రోడ్ మీద కొంతసేపు తిరిగాం. అది పారిశ్రామికవాడ. చూడటానికి ఏమీలేవు. లారీలు బాగా నడిచినట్లుగా రోడ్‌ని చూస్తే తెలిసిపోతోంది.

ఈ హోటల్ గదిలోని బాత్‌రూం లాంటిది మరెక్కడా చూడలేదు. గదిలోంచి ఆ బాత్‌రూంలోకి ట్రాన్స్‌పరెంట్ అద్దం తలుపు ఉండటంతో బాత్‌రూం బయటకి కనిపిస్తోంది. లోపల గడియ పెట్టుకునేందుకు వీలులేని స్వింగ్ డోర్. బాత్ టబ్‌కి కర్టెన్ లేదు. బదులుగా సగం బాత్ టబ్‌ని కవర్ చేసే ప్లాస్టిక్ అద్దం తలుపు. దాన్ని తెరిస్తే డబ్బ్యుసి మీదకి తెరచుకుంది. దాన్నెందుకలా డిజైన్ చేసారో అర్థంకాలేదు. ఆ అద్దం మేరకి ఇరుక్కుని స్నానం చెయ్యాలి. లేదా బయటకి నీళ్ళు చిందుతాయి. బాత్‌రూంలో సాధారణంగా ఉంచే షాంపూ, బాత్ జెల్, గోల్ఫ్ బాల్‌లా కనిపించే తెల్లటి సోప్ ఉన్నాయి. హోటల్ గదిలో సాధారణంగా ఉంచే చిన్న ఫ్రిజ్, కాఫీ పెర్కొలేటర్ లేవు.

స్నానాలయ్యాక ఆకలిగా ఉండటంతో హైదరాబద్ ఎయిర్‌పోర్ట్‌లో కొన్న చెక్కల పేకెట్‌ని తెరచి తిన్నాం. 6.40కి లాబీలోకి చేరుకున్నాం.

"వైఫైని తెలియక గదిలో వాడాం. ఈ సమాచారం ఎక్కడా ఇవ్వలేదు" క్రితం రాత్రి అమెరికానించి వచ్చిన ఎన్నారై ఆమె లాబీలో ఎవరితోనో చెప్పడం విన్నాం.

దీపక్ మా పేర్లు పిలిచాడు. మా బృందంలోని నలుగురు రాలేదు. అతను వాళ్ళ గదులకి ఫోన్ చేస్తే ఇద్దరు వచ్చారు. ఓ గదిలో ఫోన్ ఎత్తకపోవడంతో వెళ్ళి నిద్రపోయే వారిని పిలుచుకు వచ్చాడు. బస్‌లో రెస్టరెంట్‌కి వెళ్తూంటే దీపక్ చెప్పాడు.

"ఈ ట్రిప్‌లో చాలామంది పర్యాటకులున్నారు. మీ అందరికీ తలో ఫేమిలీ నంబర్ ఇస్తాను. నేనా నంబర్ పిలవగానే ఆ కుటుంబంలోని ఒకరు అంతా వచ్చారో, లేదో చెపితే చాలు. అందువల్ల టైం సేవ్ అవుతుంది. మీలో ఎవరికైనా లోకల్ సిమ్ కావాలా?"

తొమ్మిదిమంది చేతులు ఎత్తారు.

"మన టూర్ రేపట్నించి మొదలౌతుంది. ఈ బస్‌లో రొటేషన్ పద్ధతిలో సీట్లు మారాలి. ముందు కూర్చున్న వారు మర్నాడు వెనక వరసలో కూర్చోవాలి. ఇందువల్ల పేచీలు రావు. ఈ బస్ మీ ఇల్లులాంటిది. దీన్ని శుభ్రంగా ఉంచాలి. కాబట్టి ఇందులో తినకూడదు. పళ్ళు ఓకే కాని ఖాక్రాలాంటి పొడి రాలేవి అసలు బయటకి తీయకూడదు." దీపక్ హెచ్చరించాడు.

మా కోచ్ కొండల మధ్య రోడ్ మీద ప్రయాణించింది. ఎక్కడా చెట్లు, లాన్స్‌లేవు. యూరప్‌లో సాధారణంగా కనిపించే పచ్చదనం కనిపించలేదు. దారిలో అక్కడక్కడా భవంతులు కనిపించాయి. అవి బహుశ ఆ ఇండస్ట్రియల్ ఏరియాలో పనిచేసే కార్మికులవి అయి ఉండచ్చు. ఎవరో బుల్‌ఫైటింగ్ చూడాలనుందంటే చెప్పాడు.


రెస్టరెంట్ ఓనర్ ప్రవీణ్‌కుమార్

"ఇక్కడ పెద్దగా లేవు. బార్సిలోనాలో బుల్ రింగ్స్, షాపింగ్ మాల్స్ చాలా ఉన్నాయి."

కోచ్ ఆగాక మేం దిగి, సన్న సందులో దీపక్‌ని అనుసరించాం. బయట అందం కోసం రాళ్ళని పొదిగిన చిన్న భవంతిలో ఆ హోటల్ ఉంది. పేరు దివాలి రెస్టరెంట్. ఇది 'లూపే దే రువెడే' అనే చోట ఉంది. 1997లో పంజాబ్‌లోని చండీఘర్ నించి వచ్చిన ప్రవీణ్ కుమార్ 2009లో దీన్ని తెరిచాడు. అతను ఎలక్ట్రికల్ ఇంజనీర్. కొంతకాలం ఇంజనీర్‌గా పని చేసాక రెస్టరెంట్ వ్యాపారంలోకి వచ్చాడు. స్పానిష్ నేర్చుకున్నాడు.




ఆ చిన్న రెస్టరెంట్ మాతో నిండిపోయింది. బఫే డిన్నర్. సాధారణంగా విదేశాల్లో సౌత్ ఇండియన్ రెస్టరెంట్లు కనపడవు. మేం వెళ్ళిన అన్ని దేశాల్లో ఢిల్లీ, పంజాబ్‌ల నించి వెళ్ళినవారు తెరచిన నార్త్ ఇండియన్ రెస్టరెంట్లే తారసపడ్డాయి. ఎక్కడైనా వీళ్ళది స్టాండర్డ్ మెనూ. నాన్, రైస్, రెండు కూరలు, పప్పు, అప్పడం, పచ్చడి, పెరుగు, వెజ్ సలాడ్, డిజర్ట్. ఇక్కడ రెండు కూరలు పాలక్ పన్నీర్, ఆలూ మటర్.

భోజనం ముగించి రాత్రి తొమ్మిదిన్నరకి హోటల్‌కి చేరుకున్నాం. బస్‌లో తిరిగి వస్తూంటే దీపక్ మర్నాటి కార్యక్రమం గురించి అందరికీ చెప్పాడు. వేకప్ కాల్ ఉదయం 7. బ్రేక్‌ఫాస్ట్ 8. అవుట్ 9. ఎవర్నీ లేట్ చేయద్దని, లేదా వదిలేసి వెళ్తానని హెచ్చరించాడు. పదిన్నరకి పడుకున్నాం.

తలుపు లోపల హేండిల్‌కి వేలాడే బోర్డ్ మీద స్పానిష్‌లో 'నో మొలెస్టెన్' అని ఉంది అంటే 'డోంట్ డిస్టర్బ్' అనర్థం.

***2వరోజు, గురువారం, 10-9-2015***

ఉదయం ఏడుకి టెలీఫోన్ మోగితే రిసీవర్ అందుకున్నాను. స్పేనిష్ భాషలో ఓ ఆడకంఠం వినిపించింది. అది వేకప్ కాల్ అని అర్థమైంది. థాంక్స్ చెప్పి రిసీవర్ పెట్టేసాను. 8కి హోటల్లోని బ్రేక్‌ఫాస్ట్ హాల్‌కి చేరుకున్నాం. వెజిటేరియన్‌లో బ్రెడ్ (చాలా గట్టిగా ఉంది) జామ్, బటర్, చాక్లెట్, మౌసీ, క్రాయ్‌జాంట్, కార్న్‌ఫ్లేక్స్, పుచ్చకాయ, పైనాపిల్ ముక్కలు, కోల్డ్ మిల్క్, ఆరెంజ్ జ్యూస్, టీ, కాఫీ, రోజ్, మింట్, కేమోమైల్ లాంటి హెర్బల్ టీలు ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ ముగించి 9కి మా కోచ్ ఎక్కాం. కలకత్తా నించి వచ్చిన ఇద్దరు నలభైలలోని బెంగాలీ లేడీస్ లాబీలో కనిపించారు. వారిద్దరూ సిగరెట్స్ తాగుతున్నారు. వారు ఎవరితోను కలవక దూరంగా ఉండేవారు. వారిలో ఒకామె తర్వాత పద్మజతో తను రిలయెన్స్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌నని, రిత్విక్ అనే కొడుకున్నాడని, డివోర్సీనని చెప్పింది. రిత్విక్ అని పలకకూడదు రితిక్ అనాలని కూడా చెప్పింది.

దీపక్ మా కుటుంబ నంబర్లని రోల్‌కాల్ పిలిచాడు. మా నంబర్ 12.

ఒకరిద్దరు ఆలస్యం చెయ్యడంతో బస్ తొమ్మిదింపావుకి బయల్దేరింది. మా సిటీ టూర్ కోచ్ పైలట్ పేరు బోజూస్ దే డెరుస్వాన్. దీపక్ ముందుగా మైక్‌లో గాయత్రి మంత్రం చదివి చెప్పాడు.

"మీ కెవరికీ అభ్యంతరం లేదనుకుంటాను. ప్రతీ రోజుని ఈ దైవప్రార్థనతో ఆరంభిద్దాం.

ఇలాంటి ట్రిప్స్‌లో తప్పనిసరిగా గుజరాతీలు ఉంటారు. వారిలో నేను రెండు లక్షణాలని గమనించాను. అపరిచితులైనా సరే, వారంతా ఓ బృందంగా ఏర్పడతారు. అంతా ముందు సీట్లని ఆక్యుపై చేస్తారు. మరో లక్షణం సెనగపిండితో చేసిన నిలువ ఖాక్రా, సేవ్, చుడువాలాంటివి వెంట తెచ్చుకుని తింటారు తప్ప బయట కొనరు. ఈ ట్రిప్‌లోని బృందం వారు ఇందుకు మినహాయింపు కాదు. అందుకే 'గుజరాతీలు స్వీట్ తింటారు కానీ స్వీట్ పీపుల్ కాదని' నార్త్ ఇండియన్స్ అంటూంటారు.

మా స్థానిక గైడ్ సజిత్ సింగ్ దారిలో ఎక్కాడు. పదేళ్ళనించి స్థానిక గైడ్‌గా పనిచేస్తున్న ఇతను రాజస్థాన్‌లోని ఉదయపూర్ నించి వచ్చాడు.


"మీరు స్పేనిష్‌ని అర్థం చేసుకోలేరు. కాబట్టి ఇండియన్ నేషనల్ లేంగ్వేజైన ఇంగ్లీష్‌లో వివరిస్తాను. ఇంగ్లీష్ రాని వారి కోసం తర్వాత హిందీలో కూడా చెప్తాను. ఈ కోచ్ లో ఎవరూ తినకూడదు. అశుభ్రంగా ఉన్న సీట్లో మీరు కూర్చుంటారా? లేదుకదా? ఇందులో ఏదీ తినకుండా దాన్ని మీరు శుభ్రంగా ఉంచండి. రేపు మీ సీట్లో మరొకరు కూర్చుంటారని గుర్తుంచుకోండి. నా ఫోన్ నంబర్ చెప్తాను. రాసుకోండి. ఏదైనా అవసరం వస్తే నన్ను కాంటాక్ట్ చేయండి. మన ఇండియన్స్ లక్షణం అటెన్షన్ డెఫీషియెన్సీ. చెప్పింది వినక తర్వాత మళ్ళీ ప్రశ్నిస్తారు. కాబట్టి మీలో మీరు మాట్లాడుకోవడం ఆపి ఫోన్ నంబర్ జాగ్రత్తగా విని రాసుకోండి."

అతను చెప్పిన నంబర్ నేను నా నోట్ బుక్‌లో రాసుకున్నాను. కిటికీలోంచి చూస్తే పిల్లల్ని స్కూళ్ళకి నడిపించి తీసుకెళ్ళే తల్లితండ్రులు చాలామంది కనిపించారు. చలి 19 డిగ్రీల సెల్షియస్ ఉంది. అది మనం భరించగలిగే ప్లెజంట్ వెదర్.

సజిత్ ముందుగా మేడ్రిడ్ నగరం గురించి చెప్పాడు.

"యూరోపియన్ యూనియన్‌లో మేడ్రిడ్ రెండో పెద్ద నగరం. బెర్లిన్‌ది మొదటి స్థానం. మెయిన్ సిటీ జనాభా 34లక్షలు. ఇది సముద్ర మట్టానికి 2,690 అడుగుల ఎత్తున, 604 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. స్పెయిన్‌కి ఇది రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రం. ఫెలిపె -2 కాలంలో మేడ్రిడ్ దేశ రాజధానైంది. 1551లో ఫెలిపె -3 దీన్ని అధికారికంగా ప్రకటించాడు. చాలా యూరోపియన్ నగరాల్లా మేడ్రిడ్ ఏ నది ఒడ్డునా లేదు. దీని పేట్రన్ సెయింట్ శాన్ ఇసిడ్రో. ఇది ఇరుకు నగరమనే చెప్పాలి. జనాభా పెరగడంతో 1860లో దీనికి కట్టిన నాలుగు సిటీ వాల్స్‌ని పడగొట్టారు. ప్రజలు ఫుట్‌బాల్ ప్రియులు. యు.ఎన్.ఓ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్

(యు.ఎన్.డబ్ల్యుటిఓ) హెడ్ క్వార్టర్స్ ఇక్కడే ఉంది. మేడ్రిడ్‌లోని కిలోమీటర్ జీరోనించి స్పెయిన్‌లోని అన్ని రోడ్లకి కనెక్షన్స్ ఉన్నాయి. అక్కడ



మేడ్రిడ్‌లోని ఒక వీధి

జీరో కె.ఎం అని చూపించే టైల్ నేలలో బిగించి ఉంటుంది. ఈ స్క్వేర్ నించే స్పెయిన్‌లోని అన్ని రోడ్లకి కనెక్షన్స్ ఉన్నాయి. ఈ స్క్వేర్ నించే స్పెయిన్‌లోని 6 ప్రధానమైన రోడ్లు ఆరంభమౌతాయి. అంటే కిలోమీటర్ జీరో ఈ దేశంలోని అన్ని రోడ్లకీ కేంద్రం. ప్యూర్టా డెల్ సోల్ అని పిలిచే ఈ స్క్వేర్ మేడ్రిడ్‌లో టూరిస్ట్ ఎట్రాక్షన్. 31 డిసెంబర్‌న ప్రజలు ఇక్కడికి వచ్చి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ చేసుకుంటారు. న్యూ ఇయర్ రోజు అదృష్టం కోసం పన్నెండు ఆకుపచ్చ ద్రాక్షపళ్ళు తింటారు. ప్రపంచంలో మొదటి గేస్ లేంప్, మ్యూల్ ట్రామ్స్, మొదటి పబ్లిక్ యూరినల్స్, మొదటి ఎలక్ట్రిక్ వీధి దీపాలు ఇక్కడే ఆరంభమయ్యాయి.

"ప్రపంచంలోని అతి పురాతన రెస్టారెంట్ సాబ్రినో దే బోటిన్‌ని 1725లో ఆరంభించారు. అది ఇక్కడే ఉంది. రోస్ట్ లేంబ్, పంది మాంసానికి అది ప్రసిద్ధి. ప్రపంచంలోని అతి పెద్ద జారా డైమండ్ స్టోర్ (65వేల చదరపు అడుగులు) ఇక్కడే ఉంది. మేడ్రిడ్‌లోను, స్పెయిన్ అంతా ప్రజలు సాయంత్రం 3-5 మధ్య నిద్రపోతారు. దీన్ని సియెస్టా అంటారు. ఆ సమయంలో షాప్‌లు మూసుంటే తట్టకూడదు. ఇక్కడ మధ్యాహ్నం ఒంటిగంటకి మునుపు లంచ్, రాత్రి 9 తర్వాత డిన్నర్ తినరు. ఎగ్స్‌ని రాత్రి భోజనంలో తప్ప మిగిలిన యూరోపియన్స్‌లా బ్రేక్‌ఫాస్ట్‌లో తినరు.

"ప్లాజా మేయర్ ప్రధాన టూరిస్ట్ అట్రాక్షన్‌లలో ఒకటి. అక్కడ కెఫేల్లో ఏమీ తినకండి. ధరలు చాలా ఎక్కువ. 1850లో నిర్మించిన ప్లాజా మేయర్ రాయల్ పేలస్ ప్లస్ రాయల్ థియేటర్, 1631లో ఆరంభించిన బ్యూనో రెటిరో పార్క్, 1712లో స్థాపించిన నేషనల్ లైబ్రరీ, ప్రాదో మ్యూజియం, ఒపేరాలు, మ్యూజియాలు, పబ్లిక్ గార్డెన్స్, మిలటరీ మ్యూజియం, రైల్వే మ్యూజియం ప్రధాన టూరిస్ట్ స్పాట్స్. కానీ మీ ఐటనరరీలో కొన్నే ఉన్నాయి. పొల్యూషన్, ట్రాఫిక్ ఇబ్బందులు మేడ్రిడ్‌లో అధికం. భద్రత తక్కువ. అన్ని పెద్ద ఊళ్ళల్లోలా ఇక్కడ కూడా జేబు దొంగలు అధికం. కాబట్టి పాస్‌పోర్ట్‌లని జాగ్రత్తగా భద్రపరచుకోండి. ఈ నగరానికి మెట్రో ఉంది. ఎయిర్‌పోర్ట్ నగరానికి పదమూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. రింగ్ రోడ్లు, మునిసిపాలిటీ, ప్రైవేట్ బస్‌లు ఉన్నాయి. స్పానిష్ రాజు ఛార్లెస్ -3 దీన్ని బాగా అభివృద్ధి చేసాడు. 1768లో కట్టిన పోస్టాఫీస్ బిల్డింగ్ ఇంకా ఉంది. ఇక్కడే నిరసనలు జరుపుతారు. ఛార్లెస్ -3 నిర్మించిన బొటానికల్ గార్డెన్స్ ఇంకా ఉంది. 1808లో ఫ్రెంచ్ సైనికులు ఈ నగరాన్ని ఆక్రమించారు. నెపోలియన్ సోదరుడు జోసెఫ్ దీనికి రాజయ్యాడు. స్వతంత్ర పోరాటం జరిగి 1814లో ఫెర్డినాండ్ -6 తిరిగి అధికారంలోకి వచ్చాడు. మేడ్రిడ్ నించి స్వర్గానికి వెళ్ళచ్చు. స్వర్గంలోని చిన్న కిటికీనించి మేడ్రిడ్‌ని చూడచ్చని సామెత."

అమెరికాలో కుడివైపు డ్రైవ్. శుభ్రంగా ఉన్న రోడ్స్. రెస్టారెంట్స్ బయట పేవ్‌మెంట్స్ మీద బల్లలు, కుర్చీలు ఉన్నాయి. ప్రజలంతా ఉండాల్సిన బరువుతో సన్నగా, ఫిట్‌గా ఉన్నారు తప్ప అమెరికాలోలా లావు వాళ్ళెవరూ కనపడలేదు. వీధుల్లో గ్లవ్స్ తొడుక్కున్న అమ్మాయిలు ఆకుపచ్చ రంగు చెత్త సంచిలని వేన్‌లోకి వేస్తూ కనిపించారు. మన దేశంలో కూడా రీసైకిలింగ్ చెత్తని ఇలాంటి స్టాండర్డ్ సంచీల్లో నింపి బయట ఉంచే అలవాటుని ప్రవేశపెడితేనే ఇండియా మొత్తం శుభ్రంగా ఉంటుంది. 'స్వచ్ఛభారత్ అంటే జరిమానాల భారత్' అని

ఇండియాలో కొందరు గొణగడం విన్నాను. స్వచ్ఛ భారత్ సెస్ దేనికి వసూలు చేస్తున్నట్లు? దేశాన్ని శుభ్రంగా ఉంచే ప్రభుత్వ శాఖలు సరిగ్గా పనిచేయడం లేదనడానికి నిదర్శనం ఈ సెస్.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*